
# ప్రేమంటే...

– విజయగంటి

యూనివర్సిటీ క్యాంపస్




క్లాస్ రూం –

అందరూ వెళ్ళే వరకూ ఆగి, మా గ్యాంగ్ కూడా బయటపడ్డాం. మా గ్యాంగ్ అంటే విశాలి, మనూ, రమ, కల్పన మరింక నేను. కారిడార్‌లో నడుస్తుంటే ఎదురైన అటెండర్ "మనో హరి" అంటూ తెచ్చిన లెటర్‌ని మను చేతిలో వుంచాడు. మేం చెట్ల క్రిందికి చేరుకునే లోపల మను లెటర్ విప్పి చది వేసి నవ్వుతూ మా చేతికిచ్చేసింది.

అదో ప్రేమలేఖ. లేఖంతా మను అంద చందాల వర్ణనతో సాగి పోయింది. సంతకం పెట్టాల్సిన చోట మూడు నక్షత్రాలు పెట్టాడా ప్రేమికుడెవరో.

ఎవరా ఈ ట్రిబుల్ స్టార్, తెలిసిన చేతివ్రాత అవునా కాదా అంటూ మిగిలిన ముగ్గురూ తర్జన భర్జన లవుతుంటే మను ఏం మాట్లాడకుండా నవ్వుతూ కూర్చుంది.

నేను ఏం మాట్లాడలేదు. నాలుగు రోజుల క్రితం ఇదే ట్రిబుల్ స్టార్ నుండి నాకు లెటర్ వచ్చినప్పుడు లక్కీగా వీరెవ్వరూ నా పక్కన లేరు. ఒకవేళ వున్నా మనూ అంత ధైర్యంగా నేను చూపించేదాన్ని కాదు. పోనీ ఇప్పుడు చెబుదామా అనుకుంటే మనసెందుకో వొప్పుకోలేదు. ఓ ప్రముఖ రచయిత వ్రాసిన కొటేషన్ గుర్తుకు వచ్చింది. "జీవిత పథంలో ఎక్కడో ప్రవేశించి, ఒకసారి చల్లగా స్పృశించి, సుతారంగా చుట్టుముట్టి వెనక్కి జారిపోయిన ప్రేమానుభవపు జ్ఞాపకం లాంటి మేఘం... అదే చివరికి మిగిలింది. "రే ప్రొద్దున అత్తగారు మనూని కసిరినప్పుడో భర్త పట్టించుకో కుండా పేపర్ చదువుకుంటున్నప్పుడో, వంటింటి కిటికీలోంచి చూస్తూ ఈ మధుర జ్ఞాపకాన్ని తలచుకుంటే వచ్చే ఆనందాన్ని నే పోగొట్టదలచలేదు.



ప్రేమంటే ఏమిటి?...
ప్రేమలేఖ అందుకున్న ఓ పడుచుదాని ఊహ లెలా వుంటాయి?
ఆ ఊహలకి ఓ రూపొస్తే ... మాటొస్తే...

"ఏమిటంత సీరియస్‌గా ఆలోచిస్తున్నావు. ప్రేమ జ్ఞాపకాలా?" అడిగింది కల్పన కొంటెగా.

అవునన్నట్టుగా తల ఆడించాను.

"చెప్ప చెప్ప ఏమిటా సంగతి" అంటూ అడిగారు మిగిలిన టీమ్.

"ఎప్పుడో నేను టెన్త్‌క్లాస్ చదువుతున్నప్పటి సంగతి."

"అమ్మో. చాలా ఫాస్టేనే. ఏమా కథ? ఎవరా హీరో?" విశాలి.

"అతనో సింగర్. అప్పట్లో అతడే పాట పాడినా నన్ను ఉద్దేశించి. నా కోసమే పాడుతున్నాడనిపించేది"

"ఓహో" రమ.

"ఆ రోజు రేడియోలో అతని పాట విన్నాక ఇంక ఆగలేక పోయాను."

"ఐ లవ్ యూ అంటూ నువ్వూ పాడావా" రమ.

"లేదు. నాకతనితో అంత పరిచయం లేదుగా. అందుకే నాన్నగారితో చెబితే బావుంటుందనిపించింది" చెప్పడం ఆపి చూసాను. అందరూ ఆసక్తిగా వింటున్నారు.

"వెళ్ళి బాలుతో మాట్లాడండి నాన్నగారు. నేనతను లేకుండా జీవించలేను-అందామనుకున్నాను. కాని అనలేక పోయాను."

"ఇంతకీ ఏ పాట తల్లీ నిన్నంతగా కదల్చి వేసింది?" అడిగింది రమ.

"'ఏ పారిజాతమ్ము లివ్వగలనో సఖీ- అని 'ఏకవీర చిత్రంలోది ఆ పాట."

వెంటనే విశాలి కళ్ళు పెద్దవి చేసి "మై గుడ్‌నెస్ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంగారి సంగతా నువ్వు చెప్పేది" అంటుండగానే అందరూ నవ్వేసారు.

'అప్పటి సంగతి సరేకానీ తమరి ప్రస్తుత ప్రేమికుడెవరో చెబుతారా" తమాషాగా మొహం పెట్టి అడిగింది రమ.

"క్లింటన్" చెప్పాను సీరియస్‌గా.




## బలభద్రపాత్రుని రమణి

కొత్త సీరియల్ త్వరలో

"స్మార్ట్ గై. మంచి సెలక్షనే" వెటకారంగా అంది మమ.

"నే చెబుతున్నది శ్రీమతి హిల్లరీ క్లింటన్ గురించి అమెరికా ప్రెసిడెంట్ బిల్ క్లింటన్ కయినా, నా కయినా ఆవిడే స్ఫూర్తి" నవ్వారందరూ.

"మరీ చప్పగా వున్నాయమ్మాయి నీ ప్రేమ కథలు" అంది విశాలి. "పోనీ నువు చెప్ప అసలు ప్రేమంటే ఏమిటి?" అడిగాను.

"అదేమో తెలియదుగాని ప్రేమలేని జీవితం వాసనలేని పువ్వు లాంటిది" చెప్పింది విశాలి ఎమోషనల్‌గా.

"వాహ్!" అరిచాం అందరం.

"ప్రేమోవృత్తం లాంటిది. ఆద్యంతాలు తేల్చుకోవడం చాలా కష్టం" దిగులుగా అంది రమ. మేమంతా నిట్టూర్చాం.

"నువ్వు చెప్ప" అన్నాను కల్పనతో.

ఆదోసారి కళ్ళజోడు సవరించుకుని, నాకేసి ఓరగా చూస్తూ చెప్పింది.

"ప్రేమంటే స్వచ్ఛత, ఉన్నతి, ఆనందము, అది పోతే అగాథమూ, చీకటి ఆ పైన ఏర్పడే గతి" ఇక నీ నిర్వచనం చెప్ప.."

ఇంతటితో ఈ టాపిక్ మారితే బావుటుందనిపించింది.

వెంటనే "ప్రేమంటే అయోమయం" అన్నాను సీరియస్‌గా.

వాళ్ళంతా నాకేసి అయోమయంగా చూసారు.

"అవును. ప్రేమలో పడిన మనిషికి అంతా అయోమయంగానే వుంటుంది. నిదురలోకి జారుకునే వరకూ, లేచిన వెంటనే వీలైతే కలలో వెంటాడుతూనే వుంటుంది ప్రేమ భావన. మిగిలిన ప్రపంచంతో సంబంధం తెగిపోయినట్టుగాను, ఏదో ట్రాన్స్‌లో వున్నట్లుగాను వుంటుంది. మన చుట్టూ వున్న వాళ్ళంతా మనకు సిల్లీ ఫెలోస్‌లాగా అనిపిస్తుంటారు. మన ధోరణి వాళ్ళకి పిచ్చి వాలకంలా వుంటుంది."

"అనుభవమా?" – కల్పన.

"అవును. నాకు నచ్చే, నేను ప్రేమించే ఏ విషయంలోనైనా నేనలాంటి ట్రాన్స్‌లోకి వెళ్ళిపోతాను. ఎగ్జామినేషన్ మూడ్‌ని నేను ఎంతగానో ప్రేమిస్తాను. పుస్తకాలను ఆప్యాయంగా నిమురుతుంటాను. విపరీతంగా చదివేస్తుంటాను. పగటిపూట కూడా అనాలోచితంగా లైట్లు వేస్తుంటాను. 'అమ్మా! కొంచెం కాఫీ ఇయ్యవా' అని అడగటానికి 'కొంచెం కరెంట్ ఇయ్యవా' అని అడుగుతాను. అమ్మే నా కేసి వింతగా చూస్తుంది. ఎగ్జామ్స్ పూర్తయితే కాని నేనా ట్రాన్స్ నుండి బయట పడలేను."

చెప్పటం ఆపి వాళ్ళకేసి చూసాను. అందరి మొహాలలోకి సీరియస్‌నెస్ వచ్చేసింది. వచ్చే నెలలో ఫైనల్ ఎగ్జామ్స్. నలుగురూ లేచి ట్రాన్స్‌లో నడుస్తున్న వాళ్ళలా నాకు బై చెప్పి వెళ్ళిపోయారు. వాళ్ళంతా చాలా సిన్సియర్ స్టూడెంట్స్. చదవడంలోగల ఆనందాన్ని ప్రేమించే సిన్సియర్ లవర్స్.

లేచి చెట్ల కింద నుండి నడవసాగాను. ప్రశాంతమైన వాతావరణం, చక్కటి గాలి ఎప్పటిలాగే క్యాంపస్ వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. ఆ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఎప్పటిలాగే అతని జ్ఞాపకాలు నన్ను చుట్టుముట్టాయి.

* * *

ఆ రోజు నాకు బాగా గుర్తు. అసలు మరచిపోతే కదా సాయంత్రం నాలుగింటికి సునందా ఆంటీ వాళ్ళింటికి వెళ్ళాను. ఒక్క సెకన్‌లో నిలద్రొక్కుకుని ఆపుకోకపోతే గుమ్మంలోకి వస్తున్న ఆ వ్యక్తిని ఢీకొట్టే దాన్నే. "ఈయన ఇంజనీర్. నెల రోజులపాటు వుంటారు. అంకుల్ వాళ్ళ ఆఫీస్‌కి తీసుకెళ్తావా" అడిగింది అప్పుడే వెనుక నుండి వచ్చిన ఆంటీ.

ఇంజనీరింగ్ చదివిన వాళ్ళని నేనిదే మొదటిసారి కలుసుకోవటం. తలెత్తి అతడికేసి చూసాను. అతడు నవ్వుతూ నన్నే చూస్తున్నాడు. బలవంతంగా కళ్ళు మరల్చుకుని ముందుకు నడిచాను. అతడి పక్కన నడుస్తుంటే నాకెంతో గొప్పగా వుంది. "రేపటి నుండి నాకు మీ ఊరంతా చూపిస్తావా" అడిగాడతను. ఎగిరి గంతేయాలనిపించింది.

పగలంతా అతడి ఆలోచనలూ, సాయంత్రాలు కలిసి షికార్లు, రోజులు గడిచిపోతున్నాయి ఏదో ట్రాన్స్‌లో వున్నట్టుగా. 'త్రిపాది నక్షత్రంలా తిరగడమేనా' అని విసుక్కునే అమ్మ కూడా నేనతనితో వెళ్తుంటే ఏమీ అనటం లేదు. అంతటి అపురూపమైన వ్యక్తి ఎవరికైనా నచ్చక పోవడం అంటూ వుంటుందా. నాకిప్పుడతని దగ్గర బాగా చనువు వచ్చేసింది. ఎన్నో కబుర్లు చెప్పకునే వాళ్ళం. అతను మాట్లాడుతుంటే ఇంకా ఇంకా వినాలనిపించేది. ఆ రోజు సాయంత్రం కాలువ వొడ్డున కూర్చున్నాం. "తరువాతేం చేద్దామనుకుంటున్నావు?" అడిగాడతను.

'ఇంజనీరింగ్" చెప్పాను.

"ఏది నీ చెయ్యి చూడనీ" అంటూ నవ్వుతూ నా చేతిని తన చేతిలోకి తీసుకున్నాడు. నా చెయ్యి సన్నగా కంపించింది.

నెల రోజులెలా గడిచిపోయాయో తెలియదు. అతడు వెళ్ళిపోయే రోజు వచ్చింది. నేను నా గది కిటికీలో కూర్చుని మౌనంగా బయటికి చూస్తుండిపోయాను. అతడు లోపలికి వచ్చాడు. నేను తల త్రిప్పలేదు. నన్ను రెండు చేతులతో పైకెత్తేసి బయటకు నడవబోయాడు. నేను గింజుకుని క్రిందకు దిగేసాను.

"చూడు నీ కోసం ఇతనేం తెచ్చాడో" అంటూ నాన్నగారు లోపలికి వచ్చారు. చూడకూడదనుకుంటూనే చూసాను. పింక్ కలర్ ఫ్రిల్స్ ఫ్రాక్. నా కళ్ళు చెదిరాయి. "వేసుకునిరా. ఫోటో దిగుదాం" అంటూ వాళ్ళు బయటకి నడిచారు. వేసుకున్న ఫ్రాక్ గబగబా విప్పేసి ఫ్రిల్స్ ఫ్రాక్ వేసుకున్నాను. అతడు ముందు గదిలో నాన్నగారితో అంటున్నాడు. "పదకొండేళ్ళ వయసులోనే మీ అమ్మాయి ఇంజనీరింగ్ చదివి తీరాలని నిర్ణయించుకుంది. నన్నెప్పుడూ అవే విషయాలు అడుగుతుందేది" నాన్నగారు నాకేసి అభిమానంగా చూసారు.

అతడు నా వెనుకగా వచ్చి బిగించి కట్టిన నా రెండు జడలని తన వ్రేళ్ళతో పైకెత్తాడు. నాకు ఫక్కున నవ్వొచ్చింది. ఇద్దరం నవ్వుతూ వున్న ఆ ఫోజు కెమెరాలో, ఆ జ్ఞాపకాలు నా మదిలో బంధింప బడ్డాయి.

ఈ రోజు ఇంజనీరింగ్ చదువుతున్నానంటే కారణం ఆనాడు అతడిచ్చిన స్ఫూర్తి. స్టిల్ ఐ లవ్ హిమ్.

స్నేహితురాళ్ళతో కూడా మనసు విప్పి చెప్పకోలేనిదే కదా నిజమైన ప్రేమంటే. ■